

వరాహావతారంలో ద్వారకాతిరుమల శ్రీవారు



భూవరాహ అలంకారంలో ద్వారకాతిరుమల చిన్న తిరు మలేశుడు ఆదివారం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దశావతారాల్లో వరాహ అవతారంగా స్వామివారు కటాక్షించారు. సర్వాభరణ శోభితంగా భూదేవి సమేతుడైన స్వామివారి రూపం కనువిందు చేసింది.

నేడు చిన వెంకన్న కళ్యాణం 5

కూరగాయలకు ధరల మంట




ఉపాధ్యాయుల పోరుబాటకు ఆటంకాలు 5



జంగారెడ్డిగూడెంలో హంతక ముఠా అరెస్ట్

ఈ ఏడాది అంతంతే !

మేలు చేసిన లోటు వర్షపాతం



ఈ ఏడాది వర్షాలు తక్కువే.. లెక్కప్రకారం వర్షాకాలంలో నమోదు కావాల్సిన వర్షపాతానికి బాగా వెనుకబడింది. లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెల నుంచి గడిచిన నెల వరకు అంటే నాలుగు నెలలు కురిసిన వర్షాలలో 24.4 శాతం వర్షం తక్కువగా నమోదైంది. వర్షాలు తక్కువ ఉన్నా సార్వా వరి సాగు ఆశాజనకంగా కనిపిస్తున్నది. వరిసాగుకు వర్షపు నీటి ముంపు తప్పిందని రైతులు అంటున్నారు..

భీమవరం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : గత ఏడాదికంటే బాగా తక్కువ వర్షపాతం నమోదైంది. 2025 సంవత్సరంలో 791.9 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 598.8 మి.మీ మాత్రమే కురిసింది. 193 మి.మీ. వర్షపాతం వరకు ఈ ఏడాది లోటు కనిపించింది. 2024 సంవత్సరం కంటే 2025లో బాగా తగ్గాయి. గత ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 1024.7 మి.మీ. వర్షం పడింది. అధికారుల లెక్క ప్రకారం 791.9 మి.మీ కురిస్తే సరిపోతుంది. అలాంటిది 233 మి.మీ. వరకు వర్షం ఎక్కువ కురిసింది. ఈ ఏడాది వర్షాకాలంలో 598.8 మి.మీ. మాత్రమే వానలు పడ్డాయి. 2024తో పోలిస్తే 426 మి.మీ. వర్షం తగ్గింది.



భీమవరంలో తయారైన సార్వా చేను

గడిచిన నాలుగు నెలల్లో 598.8 మి.మీ వర్షం
2024తో పోలిస్తే 2025లో 426 మి.మీ తక్కువ
లెక్కప్రకారం 791.9 మి.మీ కురవాలి
మైనస్ 24.4 శాతం
అంటే ..193 మి.మీ తగ్గుదల
భారీ వర్షాలు లేకపోవడం సార్వాకు లాభం

ఆగస్టు నెలలోనే తక్కువ వర్షాలు

వర్షాకాలం అంటే ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురుస్తాయి. అలాంటిది ఈ ఏడాది ఆగస్టు నెలలోనే వర్షాలు నిరాశపరిచాయి. మొత్తం మీద ఏ నెలలోనూ అధిక వర్షాలు పడలేదు. జూన్ నెలలో 110.4 మి.మీ. కురవాల్సి ఉండగా 125.5 మి.మీ. కురిసి కొంత మెరుగు అనిపించింది. జూలై నెలలో 245.6 మి.మీ వానలు పడ్డాయి. దీంతో 56.6 శాతం లోటు కనిపించింది. ఆగస్టు నెలలో 250.4 మి.మీకు 198.0 మి.మీ పడింది. సెప్టెంబర్‌లో 185.5 మి.మీ పడాల్సి ఉండగా 168.5 మి.మీ. వర్షం కురవగా 9.2 శాతం తగ్గింది. మొత్తం మీద 24.4 శాతం వర్షాలు ఈ ఏడాది తగ్గాయి.

సార్వా సాగుకు మేలు

వరి, ఇతర రకాల పంటలల సాగుకు ఇతర ప్రాంతాల్లో వర్షమే ఆధారం అవుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా సాగు నీటి కాలువలు ఉండటం వల్ల కొంతవరకే వర్షాల మీద పంటలు ఆధారపడతాయి. అందువల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువ ఉన్నా సార్వా వరి సాగు ఆశాజనకంగా కనిపిస్తున్నది. అధిక వర్షాలు కురవకపోవడం వరిసాగుకు వర్షపు నీటి ముంపు తప్పింది. ఆగస్టు 14వ తేదీన కురిసిన భారీ వర్షానికి పది వేల ఎకరాలు ముంపునకు గురైంది. మిగిలిన 2 లక్షల ఒక వెయ్యి - మిగతా 4లో..

చేలు బాగా పండాయి



సార్వా సాగులో అధిక వర్షాలు పడితే వరిచేలు మునిగి దెబ్బతింటున్నాయి. ఈ ఏడాది తక్కువ వర్షాలు కురిశాయి. అందువల్ల వరిచేలు బాగా పండాయి. వర్షాలు తగ్గడం సార్వా సాగుకు మేలు జరిగింది.

- సీహెచ్ రామారావు, రైతు, దిరుసుమర్రు

సార్వాకు ఇబ్బంది లేదు



ఈ ఏడాది వర్షపాతం నమోదు తక్కువ . సప్లిమెంటరీగా కురవవలసిన వర్షాలలో భారీ వర్షాలు లేవు. దీంతో సార్వా చేలకు ముంపు రాలేదు. ఆదిలో పది వేల ఎకరాల్లో ముంపు వచ్చింది. అది మరలా తగ్గింది. ఏ విధంగా చూసినా వర్షాలు తగ్గడం సార్వా సాగుకు లాభం జరిగింది.

-వెంకటేశ్వర్లు,జిల్లా వ్యవసాయాధికారి

పెంటపాడు ఎంపీపీకి పదవీ గండం

అవిశ్వాసం తేదీ ఖరారు
23న తీర్మానానికి రావాలంటూ సభ్యులకు నోటీసులు
కూటమిదే పైచేయి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి హైమావతికి పదవీ గండం ముంచుకొస్తోంది. కూటమి సభ్యులు అవిశ్వాసానికి దరఖాస్తు చేశారు. అధికారులు సదరు తీర్మానంపై తేదీ ఖరారు చేశారు. ఈనెల 23న అవిశ్వాస తీర్మానానికి హాజరుకావాలంటూ ఎంపీటీసీ సభ్యులందరికీ ఆర్డీవో నోటీసులు జారీచేశారు. ఆరోజు సభ్యులంతా హాజరు కానున్నారు. పెంటపాడు మండల పరిషత్‌లో 18 మంది సభ్యులున్నారు. అందులో 13 మంది కూటమికి చెందిన వారే. తెలుగుదేశంలో ఇద్దరు సభ్యులు గత ఎన్నికల్లో గెలుపొందారు. జనసేన నుంచి ఇద్దరు విజయం కేతనం ఎగురవేశారు. వైసీపీ నుంచి ఇటీవల తొమ్మిది మంది సభ్యులు జనసేనలో చేరిపోయారు. దాంతో కూటమి బలం 13కి చేరింది. మరో వైసీపీ ఎంపీటీసీ అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. ఎంపీపీపై అవిశ్వాసం పెడుతూ సంతకాలు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. అవిశ్వాస తీర్మానంపై ఎన్నిక నిర్వహించేందుకు తేదీ ఖరారు చేశారు. సభ్యులందరికీ నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నెగ్గే దిశగా కూటమి అడుగులు వేస్తోంది. దీనిపై మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. స్వప్రయోజనాల కోసమే అవిశ్వాసం పెడుతున్నారంటూ ఆరోపణలు చేశారు. దీనిని కూటమి ఎంపీటీసీ సభ్యులు ఖండించారు. తొలినుంచి మాజీమంత్రి తీరుపై ఆ పార్టీ కేడర్‌లో అసంతృప్తి ఉంది. ఎంపీపీ పదవి పంపకంలో మాజీమంత్రి కొట్టు తప్పటడుగు వేశారంటూ వైసీపీలోనే చర్చ సాగింది. ఇచ్చిన హామీలను అమలు పరచలేకపోయారు. గడచిన ఎన్నికల తర్వాత కూడా కేడర్‌ను ఏకతాటిపై ఉంచడంలో కొట్టు విఫలమయ్యారు. ఆ ప్రభావం నియోజక వర్గంలో కొట్టొచ్చినట్టు కనపడుతోంది. అందులో భాగంగానే తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు వైసీపీ నుంచి జనసేనలో చేరిపోయారు. అందులో ఒకరికి ఎంపీపీ పదవి అప్పగించేలా జనసేన పావులు కదిపింది. తెలుగుదేశం మద్దతు ప్రకటించింది. ఎంపీపీ హైమావతిపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. అవిశ్వాసం నెగ్గితే ఎంపీపీగా హైమావతి పదవి కోల్పోతారు. తర్వాత కొత్త ఎంపీపీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి తేదీ ఖరారు చేస్తూ ఎన్నిక నిర్వహిస్తారు .ఇదంతా లాంచన ప్రాయమే. జట్లపాలెం ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మికి ఎంపీపీ పదవి ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయి.


నేడు పీజీఆర్ఎస్

భీమవరం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన ఫిర్యాదులకు సంబంధించిన సమాచారాన్ని 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

నేడు స్వచ్ఛత అవార్డుల అందజేత

భీమవరం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి అవార్డులను సోమవారం అందించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి అవార్డు, 49 జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశారని సోమవారం రాష్ట్రస్థాయి అవార్డు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందిస్తారని, జిల్లా స్థాయి అవార్డులను సోమవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందిస్తామన్నారు.

కళాశాలలకు ఊరట



ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ
చదువు పూర్తయిన విద్యార్థులకు చెల్లించిన ప్రభుత్వం
ఇంజనీరింగ్ కళాశాలలకు గరిష్ఠంగా రూ. 2 కోట్లు
కంటితుడుపేనంటున్న యాజమాన్యాలు
మరో విడత విడుదల కోసం ఎదురుచూపులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కళాశాలలకు కాస్త ఊరట లభించింది. ప్రభుత్వం ఊరిస్తూ వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలల ఖాతాలో జమచేసింది. గడచిన కొంత కాలంగా ఫీజుల కోసం ఎదురు చూస్తున్న కళాశాలలకు ఇది కొంత ఉపశమనం కలిగించింది. గడచిన రెండేళ్లలో చదువు పూర్తి చేసుకుని వెళ్లిపోయిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఫీజులు చెల్లించింది. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలకు కనిష్ఠంగా రూ. 1.50 కోట్లు జమయ్యాయి. భీమవరంలో రెండు కళాశాలలకు రూ. 2 కోట్లకు పైనే ప్రభుత్వం చెల్లించింది. అయితే బకాయిలు కొండంతలా పేరుకుపోయాయి. ఆరు విడతల్లో భీమవరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రభుత్వం ఏకంగా రూ.40 కోట్లు బకాయి పడింది. తాడేపల్లిగూడెంలోని కళాశాలకు రూ. 18 కోట్లు చెల్లించాలి. మొత్తంపైన జిల్లాలో బకాయిలు రూ. 150 కోట్లకు పైగానే పేరుకుపోయాయి. తాజాగా రూ. 20 కోట్లు మేర విడుదల చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చెల్లించిన ఫీజులు కంటితుడుపేనంటూ యాజమాన్యాలు నిట్టూరుస్తున్నాయి. మరో విడత సొమ్ములు చెల్లిస్తామంటూ ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో వాటికోసం మళ్లీ ఎదురుచూస్తున్నారు.

కలలు తల్లకిందులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాశాలలకు ఎంతగానో ఊరట పొందాయి. విద్యా సంస్థలకు అనుకూలమైన నిర్ణయాలు వెలువడతాయని ఆశించారు. వైసీపీ హయాంలో ఫీజులను కట్టడి చేశారు. బకాయిలపై కోర్టులకు వెళితే ఫీజుల్లో కోత విధించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలకు పరిష్కారం లభించలేదు. అప్పట్లో రూ. 95వేలు ఫీజు ఉన్న ఓ ఇంజనీరింగ్ కళాశాలకు వైసీపీ హాయంలో రూ. 43 వేలు చేశారు. కళాశాల యాజమాన్యం కూటమికి సానుకూలంగా ఉంటుందనో బకాయిల కోసం కోర్టును ఆశ్రయించిందనో ఫీజుల్లో కోత పెట్టింది. ఇదే విషయాన్ని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాయి. అయితే - మిగతా 4లో..

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నరసాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని రకాల వస్తువులు తగ్గుముఖం పట్టనున్నాయని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు అన్నారు. ఆదివారం చామకూరిపాలెంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. దుకాణాలకు వెళ్లి తగ్గిన వస్తువుల వివరాలను ఆరా తీశారు. అనంతరం పొత్తూరి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆదాయం పెరగనుందన్నారు. ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా పాల్గొన్నారు.

గంగాలమ్మకు ప్రత్యేక అలంకరణ



నరసాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎల్‌బిచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మోడీ, చామకూరిపాలెం, సారవ, ఎల్‌బిచర్ల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



ఉండి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాంచారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాంచారమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని ఉండి దేవునిగుడి దొడ్డిలో వున్న నాంచారమ్మ ఆలయం నుంచి మహిళలు కలశాలతో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, వాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ ఊరేగింపు నిర్వహించారు.

అన్నసమారాధన

కాళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు గ్రామ పరిధి వెంకటాపురంలో కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులకు మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కాళ్ళకూరు సొసైటీ అధ్యక్షులు దండు ప్రణవమూర్తిరాజు, దాట్ల సత్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: శరన్నవరాత్రోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొంట్లా గణపతి, ఈవో అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: దైవ కార్యక్రమాల్లో అన్నసమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వార్ల ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే అంజిబాబు పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సీతారామరాజు, ఛైర్మన్ భీమనాథం శేషారావు, ధర్మకర్తలు అడబాల శ్రీవాణి, వీరవల్లి ఉమామహేశ్వరరావు, మల్లేశ్వరరావు, కరుణ, మణికంఠ, సునీత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గోతులమయంగా రైల్వే స్టేషన్ రోడ్డు



తణుకు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రాష్ట్రపతి రోడ్డు నుంచి స్టేషన్‌కు వెళ్లే దారిలో చాలా వరకు గోతుల మయంగా ఉంది. దీంతో స్టేషన్‌కు వెళ్లే వారితో పాటు స్త్రీ సమాజం రోడ్డు వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్డుకు మరమ్మతులు చేసినప్పటికి మరలా రోడ్డు గోతులుగా మారి పోయింది. వర్షం పడిన సమయంలో గోతుల్లో నీరు చేరుతున్నది. దీనితో వాహనదారులు పడిపోతున్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంచార శకటం ద్వారా వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో తణుకు, పైడిపర్రు, మండపాక గ్రామాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలందించారు. అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కార్యదర్శి ఎం.డి స్వాలీహా, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి రూ.50వేల విరాళం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి కార్యక్రమాలకు తాడేపల్లిగూడెం జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు ఆదివారం రూ.50వేలు ఎమ్మెల్యే కార్యాలయంలో బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్పీహైస్కూల్ అభివృద్ధి పనులు, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

భీమవరం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఉరుములతో రోడ్లపై ఉన్న వాహనదారులు భీతిల్లారు. కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భీమవరం పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వాతావరణం ఉక్కబోతతో ఉంది. వేసవిని తలపించే ఎండలు కాశాయి. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో వర్షం కురవడం ప్రారంభించింది. దాదాపు గంటకు పైగా పడిన వర్షంతో భీమవరం పట్టణంలోని పలు రోడ్లు నీటమునిగాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శుభకార్యాలు చేసుకునేవారు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. ముందుగానే వర్షం నుంచి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. అయినా ఇబ్బందులు తప్పలేదు.

ఈ ఏడాది అంతంతే !

(3వ పేజీ తరువాయి)

ఎకరాలు బాగున్నాయి. 10 వేల ఎకరాలకు ముంపు తప్పింది. గత ఏడాది అధిక వర్షాలకు 50 వేల ఎకరాలు వరిచేలు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి. దీంతో వర్షపాతం తగ్గడం సార్వా సాగుకు మేలైందని రైతులు అంటున్నారు.

మెట్ట సాగు 12 వేలే

జిల్లాలో మెట్ట సాగు 12 వేల ఎకరాలే ఉంది. అది తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉంది. జూన్ నెలలో అధిక వర్షాలు కురిశాయి. దీంతో ఆ ప్రాంతాల్లో వరిసాగుకు అనుకూలంగా మారింది. మిగిలిన నెలలో తక్కువ వర్షం నమోదైనా ఇబ్బంది కలగలేదు. దీంతో ఆ ప్రాంతాల్లో వరిసాగులో 40 బస్తాలు పైబడి ఎకరానికి దిగుబడి వచ్చింది. ఇక అరటి, ఇతర పంటలకు తుపాన్‌లు, వాయుగుండాల వల్ల భారీ గాలులు, వర్షాలు లేనందున పండ్లు పెద్దగా దెబ్బ తినలేదు.

నీటి కొరత లేదు

వర్షపాతం ఈ ఏడాది 24.4 శాతం తగ్గినా గోదావరి ఉధృతంగా పలుమార్లు ప్రవహించడం సాగు, తాగునీటికి కొరత లేదు. పంట కాలువల ద్వారా సరిపడా క్యూసెక్కుల నీరు జిల్లాకు వదలడం వల్ల దిగువన ఉన్న పంటచేలకు సాగునీరు ఇబ్బంది రాలేదు. డెల్టాలో అన్ని ప్రాంతాలకు సాగునీరు వెళ్లే కాలువలు ఉండటం వర్షాలతో సంబంధం లేకుండా వరిసాగు పండించగలుగుతున్నారు.

కళాశాలలకు ఊరట

(3వ పేజీ తరువాయి)

ఉన్నత విద్యా మండలిలో వైసీపీ హయాంలో ఉన్న వ్యక్తే పదవిలో ఉండడంతో ప్రభుత్వానికి కూడా దిద్దుబాటుకు అవకాశం లేకుండా పోతోంది.ప్రభుత్వం నుంచి బకాయిలు పేరుకుపోవడంతో విద్యా సంస్థల కలలు తల్లకిందులయ్యాయి. వైసీపీ ప్రభుత్వం మూడు విడతలు బకాయి పెట్టింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మూడు విడతలు పెండింగ్‌లో ఉన్నాయి. అదిగో ఇదిగో అంటూ ప్రభుత్వం ఊరిస్తూ వచ్చింది. రెండు రోజుల క్రితం గడచిన రెండేళ్లలో చదువు పూర్తిచేసుకుని బయటకు వెళ్ళిన విద్యార్థుల బకాయిలను చెల్లించింది. మొత్తానికి కొద్దిపాటి నిధులు మాత్రమే ప్రభుత్వం విడుదల చేయడంతో కళాశాలలు గడచిన రెండేళ్లుగా చేసుకున్న ప్రణాళికలు నెరవేర్చలేక పోతున్నాయి. మున్ముందు ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల , ఫీజుల నిర్ధారణలో పరిస్థితులు చక్కబడతాయన్న ఆశతో జిల్లాలో కళాశాలలు మనుగడ సాగిస్తున్నాయి.





జువ్వలపాలెం, మొగల్తూరు, పెనుమదంలలో అమ్మవార్ల ఊరేగింపు



కొనసాగిన అమ్మవార్ల ఊరేగింపు.. నిమజ్జనాలు

కాళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జువ్వలపాలెం గ్రామంలో కనకదుర్గమ్మ, వెంకమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపులో విచిత్ర వేషధారణలు, తీన్మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిపారు.

మొగల్తూరు: కుక్కలవారితోట, పడమటిపాలెం, పివితోట, లక్కువారితోట, ముత్యాలపల్లి, లాకుపల్లవపాలెం, గుంటపల్లవపాలెం గ్రామాల్లో నిలబెట్టిన అమ్మవార్లను భారీ మేళతాళాలు, బాణసంచా కాలుస్తూ, విచిత్ర వేషధారణలతో అమ్మవార్లను ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. మొగల్తూరు కోట వద్ద ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పోడూరు: పెనుమదం ముచ్చర్లవారి వీధిలో శ్రీకనక దుర్గమ్మ దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గణపతి సమేత అష్టలక్ష్మి అమ్మవార్లతో, వివిధ వేషాధారణల మధ్య శ్రీకనకదుర్గ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. పోడూరు గ్రామం శివారు అంబటివాని చెర్వులో కనకదుర్గ అమ్మవారికి దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కోలాట భజన, వేషాధారణల మధ్య అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

రూ.లక్షా19 వేలు పలికిన లడ్డూ

ఆకివీడు రూరల్ అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): చినకాపవరంలోని దండగర్రలో దసరా నవరాత్రులు సందర్భంగా అమ్మవారి విగ్రహం వద్ద ఉంచిన లడ్డు ధర వేలం పాటలో రూ.1,19,000 పలికింది. నవరాత్రులు అంటే 9వచ్చే విధంగా 99 కిలోల లడ్డు అమ్మవారి వద్ద ఉంచారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు అనంతరం లడ్డుకు వేలంపాట నిర్వహించగా భూపతిరాజు రంగరాజు లడ్డును వేలంలో దక్కించుకున్నారు.14సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ప్రతియేటా వేలంలో రంగరాజు దక్కించుకుంటున్నారని నిర్వాహకులు తెలియ జేశారు.



దండగర్రలో 99కిలోల అమ్మవారి లడ్డు దక్కించుకున్న రంగరాజు

దానేశ్వరి అమ్మవారికి ఎంపీ, ఎమ్మెల్యేల పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, ఎంపీ పాకా సత్యనారాయణ

తణుకు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ చైర్మన్ పత్తి రామకృష్ణ, ఆలయ కమిటి సభ్యులు, ఆలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలు, చిత్ర పటాలు అందజేశారు.

'వైసీపీ విధానాలు నచ్చకే పార్టీ మారాం'

పెంటపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధానాలు నచ్చకే తామందరం జనసేన పార్టీలో చేరామని వైస్ ఎంపీపీ కొణతల వెంకట్రావు, ఎంపీటీసీలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, దేవాబత్తుల నాగమణి అన్నారు. ఆకుతీగపాడులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు సంవత్సరాల పాటు తామందరం ఎంపీటీసీలుగా కొనసాగినా గ్రామాలకు ఏమీ చేసుకోలేకపోయామన్నారు. ఇప్పుడు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తామందరం సొమ్ములు ఆశించి వేరే పార్టీలోకి వెళ్ళామని తమపై లేని పోని విమర్శలు చేస్తున్నారని అది నిజం కాదన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఎంతో మేలు



తాడేపల్లిగూడెం మెడికల్ షాపులో మందుల ధరలను పరిశీలిస్తున్న వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పట్టణంలోని మెడికల్ షాపులో జీఎస్టీ తగ్గిన తరువాత తగ్గిన మందుల ధరలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, పద్మనాభుని మురళి, సబ్నీసుకృష్ణమోహన్, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరు తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఒక ప్రక టన విడుదల చేశారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. తగ్గించిన ధరలు వల్ల ప్రతి కుటుంబానికి పది నుంచి పదిహేనువేల రూపాయలు వరకు ఆదా అవుతుందన్నారు.

భీమవరం టౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వల్ల పేద వర్గాలకు ఉపయోగకరంగా మారిందని భీమవరం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం రైతు బజార్‌లో నిర్వహించగా ఆయన మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు ప్రసంగించారు. అనంతరం రైతు బజార్‌కు వచ్చే ప్రజలకు, రైతులకు కరపత్రాలు అందించారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యవర్గం



తాడేపల్లిగూడెం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యో తి): దివ్యాంగుల సంక్షేమ సంఘ నూతన అధ్యక్షుడిగా రాజేంద్ర రెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ దివ్యాంగుల సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షులుగా కొత్త వీర్రాజు, ముఖ్య సలహాదారునిగా పి లక్ష్మణరావు, ఉపాధ్యక్షునిగా కోరశిఖ శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఆమంచి నాని, మహిళా అధ్యక్షురాలిగా ప్రసన్న, మహిళా కార్యదర్శిగా చింతాడపద్మ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉరుములు, పిడుగులు..చూడి గేదె మృతి

పాలకోడేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామానికి చెందిన కారుమంచి ఎర్రమునియ్య గ్రామంలోని సోమరాజు చెరువు దగ్గర గేదెలను మేపుతున్నాడు. ఇదే సమయంలో వర్షంతోపాటు ఉరుములు, పిడుగులు చూడి గేదె మీదపడి మృతి చెందింది.

ఉచిత వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కోరారు. ఆదివారం నాడు బ్యాంకు కాలనీలోని కోప కల్యాణ మండపంలో కోప విశ్వకాపు, జాగృతి, హైదరాబాద్ యశోధా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.



ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను సత్కరిస్తున్న మంత్రి రామానాయుడు

ఉపాధ్యాయుల వల్లే ఉత్తమ సమాజం: మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని..జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తల్లిదండ్రులు జన్మనిచ్చి పెంచి పెద్దచేస్తే ఉపాధ్యాయులు వీరిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతారని తద్వారా ఆదర్శవంతమైన ఉత్తమ సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఆదివారం రాత్రి పూలపల్లిలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 120మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సత్కరించారు. రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్‌ఛాన్సలర్ ఎం.ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, ఉన్నమట్ల కబర్ధి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 18 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

జనసేన గూటికి వైసీపీ నాయకులు

నరసాపురం టౌన్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడవ వార్డుకు చెందిన నల్లికృష్ణ ప్రసాద్‌తో పాటు మరికొంత మంది వైసీపీ నాయకులు జనసేన గూటికి చేరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విప్ నాయకర్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షులు గంగాధర్, పొన్నాల నాగబాబు, సొడదాసి శ్రీధర్, రామకృష్ణ, నల్లి రాజేష్, పోలిశెట్టి అరుణ పాల్గొన్నారు.

వాసవి ధామ్‌లో హోమాలు



పెనుగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు పురస్కరించుకుని పెనుగొండ శ్రీ వాసవి ధామ్‌లో జంగారెడ్డిగూడెంకు చెందిన భక్తు లు కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మాలధారణ కార్యక్రమం నిర్వహి ంచారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా క్షేత్రంలో గోమాత పూజ, అభిషేకం, దంపతి పూజ, వాసవి హోమాలు బెంగళూరు నుంచి వచ్చిన భక్తులు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీకి పరామర్శ



డాక్టర్ బాబ్జీని పరామర్శిస్తున్న చలసాని శ్రీనివాస్, న్యాయవాది కర్రా జయసరిత

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి(బాబ్జీ) కుమారుడు డాక్టర్ అంజన్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన సంస్మరణ సభలో పలువురు డాక్టర్ బాబ్జీని పరామర్శించారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, న్యాయవాది కర్రా జయసరిత, పెండ్ర వీరన్న, కోరాడ శ్రీనివాసరావు, దేవా రాజేశ్ ఉన్నారు.

'ఆటో వాలాల కడుపు కొట్టారు'

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ. 15వేలు ఇవ్వడం సేవ ఎలా అవుతుందని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం విలేకర్లతో జోగాడ మాట్లాడుతూ గతంలో జగన్ ఆటో వాలాలకు ప్రతి ఏడాది రూ.10వేలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ళుగా ఇవ్వకుండా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, నష్టపోయిన ఆటోవాలాలకు రూ.15వేలు ఇచ్చినట్టు చెప్పుకోవడం సేవ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆటోవాలాల కడుపుకొట్టారని అన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వెంకట్రావు పాలెంకు చెందిన దెయ్యాల రాజు రూ.20524, దాకే ఏడుకొండలుకు రూ.21200 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఆదివారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ వెంకట్రావుపాలెం గ్రామ కమిటి అధ్యక్షుడు మాదాసు సతీశ్, ఏఎంసీ డైరెక్టర్ మాదాసు నిహారిక, జనసేన గ్రామ అధ్యక్షుడు నాగవరపు నాగు, టీడీపీ ఉపాధ్యక్షుడు ఉసురుమర్తి సంధ్యారావు, కార్యదర్శి గెడ్డం ఏసుబాబు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆచంట, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కొడమంచిలి హైస్కూలులో 1999-2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వేడుకగా నిర్వహించారు. అప్పట్లో చదువుకున్న విద్యార్థులు అందరూ వివిధ ప్రాంతాల్లో ఉన్నప్పటికి ఒకే చోటకు వచ్చి వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉత్సాహంగా గడిపారు. అప్పటి గురువులను సత్కరించారు.

ప్రభుత్వానికి ఆటో డ్రైవర్ల కృతజ్ఞతలు



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే పితాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆటో వాలాలు

పెనుగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో యజమానులకు ప్రభుత్వం రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయం చేయడం పట్ల పలువురు ఆటో డ్రైవర్‌లు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పెనుగొండలోని శ్రీ వాసవి లక్ష్మి బాలాజీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పెనుగొండ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పిప్పళ్ళ సుబ్రహ్మణ్యం, బాలం నాగయ్య, కోట్ల బాబ్జి, సత్యనారాయణ, కవురు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, ఆచంట, జీడిమెట్ల మధ్య బస్సు

నరసాపురం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): నరసాపురం, ఆచంట, జీడిమెట్ల మధ్య కొత్తగా లగ్జరీ సర్వీసు బస్సు నడుపుతున్నట్లు డీఎం మేనేజర్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఈ సర్వీసు సాయంత్రం 7.30కి నరసాపురంలో బయలుదేరి పాలకొల్లు, పెనుమదం, గుమ్మలూరు, వేమవరం మీదుగా ఆచంట చేరుకుంటుంది. అక్కడ రాత్రి 8.30కి బయలుదేరి మార్టేరు, పెనుగొండ, తణుకు, టీపీగూడెం, విజయవాడ మీదుగా మరుసటి రోజు ఉదయం 7గంటలకు జీడిమెట్లకు చేరుకుంటుంది. తిరిగి అదే రోజు రాత్రి 7.30కి అక్కడ బయలుదేరి ఇదే రూట్‌లో మరుసటి రోజు ఉదయం 7గంటలకు ఆచంట మీదుగా నరసాపురం వస్తుందని డీఎం చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం రాయలం గ్రామంలో పేకాట శిబిరంపై శనివారం రాత్రి టూటౌన్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అరెస్ట్ చేసి రూ.47,640 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

వాసవీ సేవా కార్యక్రమాలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ సిహెచ్‌ఎన్‌వీఎస్ ప్రసాద్ అధికార పర్యటనలో భాగంగా ఆదివారం రూ. 5లక్షల విలువతో 68 సేవా కార్యక్రమాలను చేపట్టారు. 14మంది పేద విద్యార్థినీలకు సైకిళ్ళు, వివిధ ప్రాంతాల్లో ప్రజలు సేద తీరేందుకు సిమెంట్ బెంచీలు, అలాగే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, వైద్య సహాయంగా ముగ్గురుకి, ఆరుగురికి నిత్యావసర సరకులు, ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న వాసవీ ఆలయానికి రూ.2.5 లక్షలు అందజేశారు. ఈసందర్భంగా నలుగురు నూతన సభ్యత్వాల ద్వారా రూ.17.500 వచ్చినట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాదర్తి శివ నాగేశ్వరరావు, కె రఘు తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధికారి పి.కొండ ప్రకాష్, సురేష్, సిహెచ్ వెంకటేశ్వరరావు, గాదె జనార్దన గుప్త, ఎంవివి నరసింహమూర్తి, ఎస్ మైధిలి, కమిటీ చైర్మన్ కెవిఆకెకె మోహన్, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, పచ్చిగోళ్ళ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు పది ప్రత్యేక బస్సులు

భీమవరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణం కావడంతో ఒక్కసారిగా బస్సులకు డిమాండ్ ఏర్పడింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల నుంచి ప్రతిరోజు 14 బస్సులు నడుపుతుండగా రిజర్వేషన్ ఫుల్ అయింది. ఆదివారం జిల్లా నుంచి ప్రత్యేకంగా 10 ప్రత్యేక సర్వీసులను పంపించారు. భీమవరం డిపో నుంచి 3, నరసాపురం నుంచి 3, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి 2 బస్సులు చొప్పున పంపించారు. సోమవారం కూడా రెగ్యులర్ సర్వీసులకు రిజర్వేషన్లు పూర్తి కావడంతో భీమవరం డిపో నుంచి ప్రస్తుతం ఒక స్పెషల్ సర్వీసు బస్సును ఏర్పాటు చేశారు.



ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో చెస్, క్యారమ్స్ పోటీల్లో రెవెన్యూ ఉద్యోగులు

ఉత్సాహంగా 'రెవెన్యూ' క్రీడా ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఆదివారం అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. వాకింగ్ రేస్, క్యారమ్స్ - డబుల్స్, టెన్నికాయిట్, 100 మీటర్ల డాష్, షాట్‌పుట్, 4x100 రిలే, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, మ్యూజికల్ చెయిర్స్, టెన్నికాయిట్, తదితర పోటీల్లో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. వివిధ క్రీడలకు సంబంధించి 65 మందిని ఎంపిక చేసినట్లు రమేష్‌కుమార్ తెలిపారు. నవంబరు 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీలో పాల్గొనే రెవెన్యూ ఉద్యోగులకు ప్రభుత్వం ఐదు రోజులు సెలవు ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు తేవాలని రమేష్‌కుమార్ ఆకాంక్షించారు. రామిశెట్టి వెంకట రమేష్, ప్రమోద్ కుమార్, కృష్ణస్వామి, యశ్వంత్ పర్యవేక్షించారు.


సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు

ఉపాధ్యాయుల పోరుబాటకు ఆటంకాలు

- ధర్నా రోజునే పాఠశాలల్లో జీఎస్టీ అవగాహన కార్యక్రమం
- ప్రభుత్వ ఉత్తర్వులపై ఫ్యాప్టో నిరసన

ఏలూరు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పోరుబాట పేరిట ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఆటంకం కలిగిస్తుందని పలువురు నాయకులు అన్నారు. ఏలూరులో ఫ్యాప్టో సభ్య సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా చైర్మన్ మోహన్, కార్యదర్శి ఆదినారాయణ, తదితరులు మాట్లాడుతూ ధర్నాకు టీచర్లు హాజరు కాకుండా చూడడానికి ఈ నెల 7న పాఠశాలల్లో జీఎస్టీ తగ్గింపు, శ్లాబ్‌లపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని డీఈవో ఉత్తర్వులు జారీచేయడాన్ని ఖండించారు. బోధనకు ఏమాత్రం ఉపయోగపడని ఇటువంటి కార్యక్రమాలను ఫ్యాప్టో బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. విజయవాడ పోరుబాట ధర్నాకు జిల్లా నుంచి మంగళవారం పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి కనీసం వెయ్యిమంది ఉపాధ్యాయులు హాజరయ్యేలా సమాయత్తం చేస్తున్నామన్నారు. ఫ్యాప్టో జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాష్, రవికుమార్, శివరామ్, రమేష్, మనోజ్‌కుమార్, రామారావు, మురళీకృష్ణ, రవీంద్ర, సురేష్, రామ్మోహన్, ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు కోరారు. లూథరన్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్, కో-ఆర్డినేటర్ ఎం.రాజలింగం మాట్లాడుతూ ఈ నెల 11న విజయవాడలో విజ్ఞాపన సభలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలన్నారు. తాత్కాలిక ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, 12 నెలల జీతం, మేజర్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎం.అనిల్, అరవింద్, ఎంవీ కృష్ణారావు, హేమంత్ కుమార్, వీఎల్ఎన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ వర్కర్ల మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై వేధింపులు ఆపాలి

తణుకు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకానికి సంబంధించి కొత్త బస్సులు ఏర్పాటుకు నిధులు కేటాయింపుతో పాటు సిబ్బందిని నియమించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఫెడరేషన్ జిల్లా రెండో మహసభ ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సిబ్బంది నియామకాలు లేకుండానే ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను తొలి నుంచి సమగ్రమైన అధ్యయనంతో చేస్తే స్వాగతిస్తామని చెప్పారు. పథకం ప్రారంభించిన నెలరోజుల్లోనే కండక్టర్, డ్రైవర్‌లు 60 మందికిపైగా సస్పెన్షన్లకు గురయ్యారని వివరించారు. ఈ పథకం ఉద్యోగులను వేధించే పథకంగా మారకూడదని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏఎన్ రాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర, తణుకు డిపో కార్యదర్శి శ్రీనివాసు, తాడేపల్లిగూడెం డిపో సహాయ కార్యదర్శి కట్టా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆధార్ సేవలను వినియోగించుకోండి

భీమవరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తపాలా వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో మూడు పాఠశాలల్లో ఈ నెల 8 నుంచి 14 వరకు ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఎస్‌పీఎం కె.హరికృష్ణప్రసాద్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు తణుకు ప్రభుత్వ బాలుర పాఠశాల, 10, 11 తేదీల్లో తణుకు బాలికోన్నత పాఠశాల, 13, 14 తేదీల్లో వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. 15 నుంచి 17 ఏళ్ల వయసు పిల్లలకు బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో ఉచితంగా నమోదు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపాలా శాఖ ఆర్థిక చేయూతనందించేందుకు గాను పొదుపు బ్యాంకు ఖాతాలను పది సంవత్సరాల లోపు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతాలు, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరుచుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణం

- కల్యాణ వేదిక.. వెండి గరుడ వాహనం సిద్ధం
- నేత్రపర్వంగా శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం

ద్వారకాతిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్య కల్యాణ మహోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. సోమవారం రాత్రి చిన వెంకన్న కల్యాణం అంగరంగ వైభవంగా జరిపేందుకు అనివేటి మండపంలో కల్యాణమండపాన్ని ముస్తాబు చేశారు. మండప పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పూల అలంకరణ సోమవారం సాయంత్రానికి పూర్తవుతాయని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. శ్రీహరి కళాతోరణ వేదికపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. కల్యాణవేడుక అనంతరం స్వామివారి తిరువీధి సేవకు వెండి గరుడ వాహనాన్ని సిద్ధం చేశారు.

కన్నుల పండువగా ఎదుర్కోలు మహోత్సవం

బ్రహ్మాండ నాయకుడైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవంగా వైభంగా సాగింది. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన ఉత్సవం చూపరులకు నేత్రపర్వమైంది. వివాహం జరిగే ముందు రోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలుగా పండితులు చెబుతున్నారు. ఆలయ ఆవరణలో వెండి శేషవాహనంపై ఉభయ దేవేరులతో స్వామిని ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. నిత్యకల్యాణ వేదికపై ఉంచి అర్చకులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మండప ఆవరణలో అర్చకులు, అధికారులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను, వారి కీర్తిని తెలియజేశారు. రాత్రి వెండిశేష వాహనంపై జరిగిన తిరువీధి సేవ భక్తజనులను ఆకర్షించింది.


ఎదుర్కోలు ఉత్సవంలో స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు


విద్యుత్‌కాంతులతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం


హనుమంతవాహనంపై స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు


అనివేటి మండప వద్ద విద్యుత్ దీపాలంకరణ

గోవిందా.. గోవిందా..

- శేషాచలం కొండపై బ్రహ్మోత్సవ సందడి
- బంగారు హనుమద్వాహనంపై శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న దివ్య బ్రహ్మోత్సవాలలో వేద మంత్రోచ్చరణతో శేషాచల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీవారు బంగారు హనుమద్వాహనంపై ఆదివారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. ధనుర్బాణాలు ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు బంగారు హనుమంత వాహనంపై భక్త జనరంజకంగా తిరువీధుల్లో ఊరేగారు. శ్రీవారి హనుమద్వాహన సేవ నాటి రామరాజ్య వైభవాన్ని పురవీధుల్లో సాక్షాత్కరింప చేసింది.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

భక్తుల రద్దీతో చిన వెంకన్న క్షేత్రం ఆదివారం కిటకిటలాడింది. దసరా సెలవులు ముగుస్తుండడంతో వివిధ ప్రాంతాల వారు శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి భక్తుల రాకతో అన్ని విభాగాలు రద్దీగా కనిపించాయి. వేలాది మంది యాత్రికులు, భవానీ దీక్షాధారులు క్షేత్రానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా. శ్రీవారి దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది.

దేదీప్య మానం.. ద్వారకాతిరుమల క్షేత్రం

బ్రహ్మోత్సవ శోభతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మిరు మిట్లు గొలుపుతోంది. ఆలయం విద్యుత్ దీపకాంతులతో చూపరులకు కనువిందు చేస్తోంది. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. అనివేటి మండప ప్రాంతం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది.


స్వామి దర్శనార్థం క్యూలైన్‌లో భక్తులు



కూరగాయలకు ధరల మంట

తాడేపల్లిగూడెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. వంకాయల ధర ఒక్కసారిగా పెరిగింది. గత వారం కిలో రూ.60 ఉండే వంకాయి రూ.80కి చేరింది. దిగుబడి తగ్గడమే ధర పెరగడానికి కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. కొయ్యలగూడెం, సిద్ధాంతం, నల్లజర్ల, పోతవరం, పెన్నాడ ప్రాంతాల నుంచి వంకాయలు తాడేపల్లిగూడెం మార్కెట్‌కు దిగుమతి అవుతాయి. టమాల ధర మాత్రం గత వారంతో పోల్చుకుంటే తగ్గింది. కిలో రూ.50 వరకు ఉండే టమాటా ఈ వారం రూ.30కు పడింది. మిగిలిన కూరగాయల ధరల్లో మార్పులేదు. దసరా తరువాత కూరగాయల ధరలు తగ్గుతాయని అంచనా వేసినా నిరాశే ఎదురైంది. బీరకాయలు కిలో రూ50, బెండ, దొండ, దోస కాయలు కిలో రూ.40, కాకర రూ.50, ఆగాకర రూ.120, పచ్చిమిర్చి రూ.50, క్యారెట్, బీట్‌రూట్ రూ.40, క్యాప్సికం రూ.120, కంద కిలో రూ.70, పెండ్లం రూ.80, పొట్ల కాయ రూ.30, ఆనప రూ.30కు విక్రయిస్తున్నారు.

చికెన్ ధర పెరిగింది

చికెన్ ధరలు పెరిగాయి. గత వారం స్కిన్‌లెస్ కిలో రూ.220 ఉంటే ఈ వారం రూ.240, విత్ స్కిన్ రూ.200 నుంచి రూ.220కు విక్రయిస్తున్నారు. దసరా తర్వాత మాంసాహారం వైపు జనం ఎగబడ్డారు. పచ్చి చేపలు కొనేవారు కూడా ఎక్కువగా కనిపించారు. దీంతో రెండు వారాల పాటు వెలవెలపోయిన మాంసం దుకాణాలు ఇప్పుడు కొనుగోళ్లు పెరగడంతో రద్దీ కనిపించింది.

ఉల్లిపాయల ధరలు స్థిరంగానే ఉన్నాయి. గత వారంతో పోల్చుకుంటే ధరల్లో వ్యత్యాసం లేదు. నాణ్యమైన (పెద్దవి) మహారాష్ట్ర ఉల్లి రూ.100కు నాలుగు కిలోలు ఇస్తున్నారు. రెండో రకం ఉల్లి రూ.రూ.100కు 5కిలోలు ఇస్తున్నారు. ఆటోల్లో ఇంటింటికి తెచ్చేవారు మహారాష్ట్ర ఉల్లిలో కడప ఉల్లిని జోడించి రూ.100కు 5కిలోలు, 6కిలోల వంతున విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లి హోల్‌సేల్‌గా క్వింటా రూ.1200 నుంచి 1800 మధ్య విక్రయాలు జరుగుతున్నాయి. కడప ఉల్లి క్వింటా రూ.700 నుంచి రూ.1300 మధ్య అమ్ముతున్నారు. కర్నూలు ఉల్లి ఇప్పుడు మార్కెట్లోకి రావడం తగ్గింది. ఇప్పుడు కడప, మహారాష్ట్ర ఉల్లి మాత్రమే మార్కెట్‌కు వస్తున్నాయి.

బీచ్‌లో యువకుడి గల్లంతు

మొగల్తూరు, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కేపీ పాలెం బీచ్‌కు స్నేహితులతో కలిసి వచ్చిన యువకుడు సముద్రస్నానం చేస్తూ గల్లంతయ్యాడు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన మేడేపల్లి ప్రవీణ్ (38) గల్లంతయ్యాడు. ఆదివారం కావడంతో విజయవాడ నుంచి 13 మంది స్నేహితులు రెండు కార్లలో కేపీ పాలెం తీరానికి వచ్చారు. తీరం నుంచి పెద్దమైనవానిలంక వైపు సముద్ర స్నానానికి దిగిన వీరిలో ప్రవీణ్ గల్లంతయ్యాడు. విజయవాడలోని ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వీరంతా సముద్రతీరంలో గడిపేందుకు వచ్చారు. ప్రవీణ్ అలల ఉధృతికి గల్లంతైనట్టు అతని మిత్రులు మొగల్తూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మొగల్తూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ఆగిరిపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదా ఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఆగిరిపల్లి ఎస్ఐ శుభశేఖర్ వివరాలు ప్రకారం శోభనాపురానికి చెందిన మేడా తిరుపతిరావు (36) ఈదర రోడ్డులోని హనుమాన్ జంక్షన్‌కు చెందిన తోట రమేష్ పందుల ఫారంలో పనిచేస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా ఫారంను శుభ్రం చేస్తున్న సమయంలో ఇతను కరెంటు వైర్‌కు తగిలి విద్యు దాఘాతంతో అక్కడకక్కడే మృతి చెందాడు. భార్యా పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లభ్యంకాని వృద్ధురాలి ఆచూకీ

ముదినేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భర్త మరణించాడన్న మనోవేదనతో ఇంటి నుంచి ఈనెల 3న వెళ్లిపోయిన ముదినేపల్లికి చెందిన వీరంకి విమల (65) ఆచూకీ లభ్యం కాలేదు. కొంత మంది వ్యక్తులు ఒక వృద్ధురాలు ఈ నెల 3న ఉదయం పోల్‌రాజ్ కాల్వలో దిగి నీటిలో కొట్టుకుపోయినట్టు చెప్పడంతో ఆమె విమలే అయి ఉంటుందన్న ఉద్దేశంతో పోలీస్, అగ్నిమాపక సిబ్బందితో పాటు అమలాపురం నుంచి వచ్చిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం కూడా గాలిస్తోంది. ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, కాకినాడ మూడో బెటాలియన్‌కు సంబంధించిన ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధురాలి కోసం పోల్‌రాజ్ కెనాల్‌లో రెండు రోజులుగా ముమ్మరంగా గాలిస్తున్నా ఆదివారం రాత్రి వరకు ఆమె ఆచూకీ తెలియలేదు. అయితే కాల్వలో కొట్టుకుపోయిన వృద్ధురాలు విమలా? వేరొకరా? అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీంతో వృద్ధురాలి అదృశ్యంపై ఇతర ప్రాంతాల్లో కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు

టి.నరసాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన గురజాల గంగాభవానికి అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో గంగభవాని తల్లిదండ్రులు రూ.1.55 లక్షల నగదు, 2కాసుల బంగారం కట్నంగా ఇచ్చారు. కొంత కాలం సంసారం సజావుగా సాగింది. వారికి పాప, బాబు ఉన్నారు. ఇటీవల వెంకటేశ్వరరావు వ్యసనాలకు అలవాటుపడి అదనంగా రూ.2 లక్షలు, కొంతభూమి తన పేరున ఇవ్వాలని తల్లి వీరనాగతో కలిసి భార్యను వేధిస్తున్నారు. గతంలో ఒకసారి ఆమెను ఇంటి నుంచి ఆమెను బయటకు గెంటివేశారు. పెద్దల సమక్షంలో మాట్లాడటానికి ప్రయత్నించినా నిరాకరించడంతో గురజాల గంగాభవాని ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో హంతక ముఠా అరెస్ట్

- వారంతా చోరీలకు పాల్పడే ముఠా
- సొత్తు పంపకాల్లో విభేదాలు
- ముఠా సభ్యుడి దారుణ హత్య

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వారంతా 25 నుంచి ముప్పై ఏళ్లలోపు యువకులే. వ్యసనాలకు లోనై ముఠాగా ఏర్పడి దొంగతనాలకు అలవాటు పడ్డారు. చోరీ సొత్తు పంపకాల్లో తేడా రావడంతో గొడవపడ్డారు. చివరకి ముఠాలో ఒకరిని దారుణంగా హతమార్చారు. హంతక ముఠా చివరికి పోలీసులకు పట్టుబడింది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ముఠాలో ముగ్గురు అన్నదమ్ములు. మరో నలుగురు స్నేహితులు కలిసి అనేక ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగతనం కేసుల్లో పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించారు. జైలు నుంచి విడుదల కాగానే తిరిగి చోరీలకు పాల్పడ్డారు. పంపకాల్లో తేడాతో ముఠాలో వ్యక్తినే చంపి హంతకులయ్యారు.

జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని బైనేరు వంతెన వద్ద ఈ నెల 3న కర్రి రాజేశ్ (26)ను హత్య చేసిన ఆరుగురు దొంగల ముఠా సభ్యులు షేక్ ఖాశిం, షేక్ నాగుల్ మీరా, వాసంశెట్టి రామచంద్ర పవన్ కుమార్ అలియాస్ స్కైలాబ్, సమ్మంగి మంగరాజు, షేక్ జహీరుద్దీన్ అలియాస్ చోటు, మరీదు సాయి అలియాస్ సైకో సాయిని హత్య జరిగిన మరుసటి రోజు శనివారం జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన రెండు చాకులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కొక్కరిపై 3 నుంచి 10 చోరీ కేసులున్నాయని డీఎస్పీ యు.రవిచంద్ర ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు, విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

చాకుతో పొడిచి.. పీక కోసి..

మృతుడు రాజేశ్, హత్యకు ప్రధాన సూత్రధారి షేక్ ఖాశిం స్నేహితులు. ఇద్దరూ కలిసి అనేక ఇళ్లలో చోరీలు చేశారు. కొంత కాలం క్రితం వరంగల్ జిల్లాలో చోరీ సొత్తు పంపకాల్లో రాజేశ్, ఖాశిం మధ్య విభేదాలు వచ్చాయి. రాజేశ్‌పై కక్షతో ఖాశిం సోదరులు నాగుల్ మీరా, జహీరుద్దీన్, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రాజేశ్ హత్యకు పథకం రచించాడు. పలు కేసుల్లో నిందితుడైన రాజేశ్ పరారీలో ఉన్నాడు. ఈ నెల 3న రాజేశ్ ఇంటికి వచ్చాడని తెలిసి వెంటాడి పట్టుకుని బలవంతంగా మోటార్ సైకిల్‌పై బైనేరు వంతెన సమీపానికి తీసుకెళ్లారు. ఆరుగురు కలిసి రాజేశ్‌ను కొట్టి టవల్‌తో కాళ్లను కట్టేసి పొట్టలో చాకుతో బలంగా పొడిచి పీక కోసి దారుణంగా హత్యచేసి మృతదేహాన్ని అక్కడే వదిలి పారిపోయారు. ఎస్సై ఎస్ కె.జబీర్ కేసు నమోదు చేయగా సీఐ ఎంవీ.సుభాష్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఒక్క రోజులోనే నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందికి రివార్డు కోసం ఎస్పీకి సిఫారసు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండుకు పంపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరందరిపై షీట్లు తెరుస్తామని, వారిపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. సమావేశంలో సీఐ ఎంవీ.సుభాష్, ఎస్సై ఎస్‌కె.జబీర్, ఏఎస్సై ఎన్‌వి.సంపత్ కుమార్, పీసీలు ఉన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు, (ఇన్‌సెట్) మునియ్య (ఫైల్)

మునిసిపల్ ఉద్యోగి వేధింపులతో

పారిశుధ్య కార్మికుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయ పారిశుధ్య కార్మికుడిపై ఉద్యోగి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూనపాముల నాగమునియ్య (51) ఆదివారం మృతి చెందాడు. పారిశుధ్య కార్మికులు మృతుడిని వేధింపులకు గురిచేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పట్టణ సీఐ ఆదిప్రసాద్, ఎస్సై బాదం శ్రీను చేరుకున్నారు. కార్మికులకు సర్దిచెప్పి నాగముని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య దయామణి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భగీరథుడి విగ్రహం ధ్వంసం.. కేసు నమోదు

పోలవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్‌లో భగీరథుడి విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కొన్నేళ్ల క్రితం భగీరధుడు, శివుడి విగ్రహాలను ధ్వంసం చేయడంతో మళ్లీ మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. ఇరిగేషన్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ రైటర్ జెట్టి భీమశేఖర్ తెలిపారు.

తండ్రిని కొట్టి చంపిన కొడుకు

కుక్కునూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజరం పంచాయతీ ముత్యాలంపాడులో తండ్రిని కొడుకు కొట్టి చంపిన సంఘటన ఆదివారం జరిగింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్రిష్టం కృష్ణ (52)కు భార్య ధనలక్ష్మి, కిరణ్‌కుమార్, జవహర్ ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో రోజూ భార్య ధనలక్ష్మిని ఇబ్బంది పెడుతున్నాడు. చిన్న కొడుకు జవహర్ పలుమార్లు తండ్రిని మందలించాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో కృష్ణ తాగివచ్చి భార్య ధనలక్ష్మిని తిడుతూ కొట్టాడు. జవహర్ అడ్డువచ్చి తండ్రితో గొడవ పడ్డాడు. అనంతరం తండ్రి తలను పట్టుకుని గుమ్మానికి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణ ఆదివారం ఉదయం 7గంటల సమయంలో మృతి చెందాడు. దీనిపై మృతుడు కృష్ణ భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపి కేసు నమోదు చేశారు.


విచారణ జరుపుతున్న పోలీసులు

ట్రాక్టర్ రొటేవేటర్‌లో పడి విద్యార్థి మృతి

పోలవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ రొటేవేటర్‌లో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లెల్లగూడెం పంచాయతీ ముత్యాలరావుపేటలో శనివారం రాత్రి జరిగింది. స్టేషన్ రైటర్ జెట్టి భీమశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుంజం రామ్‌చరణ్ (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పొలంలో ట్రాక్టర్ రొటేవేటర్‌తో దున్నుతుండగా డ్రైవర్ పక్కన కూర్చుని రామ్‌చరణ్ పనులు చూస్తున్నాడు. అదుపు తప్పి రొటేవేటర్‌లో పడి నలిగి సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి కుంజం నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు రైటర్ తెలిపారు.